ఘనంగా చేగువేరా జయంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

రంగారెడ్డినగర్: సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన చేగువేరా జయంతిని శనివారం షాపూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ..నేటి యువత ఆయన స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ నాయకుడు అంజయ్య, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు రావుల స్వాతి తదితరులు పాల్గొన్నారు

నూతన కలెక్టర్‌ను కలిసిన టీజీవోస్ ప్రతినిధులు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మిక్కిలినేని మనుచౌదరిని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) అధ్యక్షుడు వినోద్‌కుమార్ సంఘం ప్రతినిధులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవోస్) జిల్లా కార్యదర్శి కురుమూర్తి, సహ అధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యక్షులు రవీందర్, రఘునందశౌడ్, కృష్ణ, ఝాన్సీరాణి, విజయకుమారి, సంయుక్త కార్యదర్శి ఆనందరావు, కోశాధికారి కరుణాకర్ రావు, కార్యాలయ కార్యదర్శి సాయికృష్ణ, కార్యవర్గసభ్యుడు తిరుపతి ఉన్నారు.

ఘనంగా హోమం



దుండిగల్: మున్సిపల్ పరిధి భౌరంపేట్‌లోని శిఖర స్కూల్‌లో శనివారం విద్యార్థి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహించినట్టే ఈ సంవత్సరం కూడా హోమాన్ని నిర్వహించామని ప్రిన్సిపాల్ హేమలత తెలిపారు.

సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం

ఓల్డ్ బోయిన్‌పల్లి: హనుమాన్ నగర్ కాలనీ వాసుల సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శనివారం నాయకులతో కలసి ఆయన హనుమాన్‌నగర్‌లో పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు రోడ్లపైకి వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ డంప్ చేయవద్దని, నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చెత్తను పేరుకుపోకుండా తొలగించాలన్నారు. కార్యక్రమంలో హనుమాన్ నగర్ అధ్యక్షుడు పోచయ్య, రవికుమార్, నరసింహరాజు, సతీష్, రమేష్, సంపత్, మల్లేష్, బాల్‌రాజు, టెంపుల్ రాజు, మట్టి శ్రీను, రమేష్‌గౌడ్, జహంగీర్, మహిళలు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 32వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పుత్రకామేష్టి యాగం, సంతాన యోగ్యతకై ఉదయం 10 గంటలకు గరుడ ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు శేషవాహన సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వివాహం కాని వారికి వివాహ యోగ్యతకై కల్యాణమస్తు, శుభ వివాహ ప్రాప్తి సర్వదోష నివారణ యాగం, సంతానం లేనివారికి పుత్ర కామేష్టి యాగం, ఉదయం 8 గంటలకు సూర్య ప్రభ అశ్వ వాహన సేవ, సాయంత్రం 6 గంటలకు హంస వాహన సేవ వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో పరిసర ప్రాంత భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నర్సరీలపై నిర్లక్ష్యం!



శ్రీనివాస్‌నగర్‌లో నర్సరీ పరిస్థితి

ప్రతి సంవత్సరం లక్షలాది మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి

- నర్సరీల్లో కనిపించని మొక్కలు
- వన మహోత్సవానికి మొక్కలు ఎలా?
- పట్టించుకోని అధికారులు

నిజాంపేట్: పర్యావరణ పరిరక్షణకు వర్షాకాలం సీజన్‌లో ప్రభుత్వం మొక్కలు నాటడంతో పాటు ప్రజలకు కావాల్సిన పండ్లు, పూల మొక్కలు సైతం పంపిణీ చేసేవారు. అందు కోసం ఆయా ప్రాంతాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచే వారు. కానీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ సీజన్‌లో వన మహోత్సవం విజయవంతంగా జరుగుతుందా? లేదా? అని పర్యావరణ ప్రేమికులు, ప్రజలు, వివిధ పార్టీల నాయకులు అడుగుతున్నారు. ప్రతి సంవత్సరం వేసవి కాలం నుంచే మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి జూన్ నెలలో వర్షాలు పడే నాటికి లక్షలాది మొక్కలను సిద్ధంగా ఉంచేవారు. స్థానిక అవసరాలకు తగినట్లు ప్రతి సంవత్సరం నర్సరీల్లో మొక్కలు పెంచి నాటేవారు. గత సంవత్సరం కూడా సుమారు 3.5 లక్షల మొక్కలను నర్సరీల్లో పెంచి వర్షాకాలం సీజన్ ప్రారంభం కాగానే కాలనీల్లోని రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో, పార్కుల్లో, ప్రభుత్వ స్థలాల్లో, చెరువులు, కుంటల కట్టలపై ఇలా వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు.

ఇండ్లల్లో నాటే మొక్కల పంపిణీ ఎలా?

వర్షకాలంలో కాలనీల్లో, బస్తీల్లో, గేటెడ్ కమ్యూనిటీల్లో, ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవాలు నిర్వహించి పంపిణీ చేసే వారు. మామిడి, జామ, ఉసిరి, బాదం, నిమ్మ, నేరేడు ఇలా పలు రకాల పండ్ల మొక్కలతో పాటు కనకంరాలు, మల్లే, మందార, లాంటి పూల మొక్కలు సైతం ప్రజలకు పంపిణీ చేసేవారు. కానీ ప్రస్తుతం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎక్కడ కూడా న ర్సరీల్లో మొక్కలు లేవు. మరి ప్రజలకు మొక్కల పంపిణీ ఏ విధంగా చేస్తారో చూడాలి.

నర్సరీల్లో కానరాని మొక్కలు

కార్పొరేషన్‌లో ప్రతి సంవత్సరం సుమారు 10 నర్సరీల వరకు ఉండేవి. సాయినగర్, ప్రశాంతి గోల్డెన్ హిల్స్, శ్రీనివాస్‌నగర్, మధురానగర్, సిరి ఎన్‌క్లేవ్, సాయి అనురాగ్ కాలనీలోని కవ్య అవెన్యూ ప్రాంతాల్లో నర్సరీలను కార్పొరేషన్ అధికారులు నిర్వహించేవారు. వీటిలో ప్రతి సంవత్సరం లక్షలాది మొక్కలు పెంచి ప్రజలకు పంపిణీ చేసేవారు. అదే విధంగా వివిధ ప్రాంతాల్లో నాటే వారు. కానీ ప్రస్తుతం కేవలం శ్రీనివాస్‌నగర్ నర్సరీల్లో కేవలం సుమారు 2 వేల వరకు మొక్కలు తప్ప ఎక్కడ కూడా మొక్కల పెంపకమే లేదు. వాటి నిర్వహణ లేదు.

జీహెచ్‌ఎంసీ నుంచి మొక్కలు తీసుకుంటాం

జూన్ 2వ తేదీ నుంచి సెప్టెంబర్ 10 వరకు 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు' 100 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలోనే వన మహోత్సవం నిర్వహించడం జరుగుతుంది. మొక్కలు నాటేందుకు జీహెచ్‌ఎంసీ నుంచి తీసుకువచ్చి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఖాళీ ప్రదేశాల్లో, రోడ్ల పక్కన నాటడానికి ఏర్పాట్లు చేస్తాం. ప్రస్తుతం వివిధ కార్యక్రమాలు, కాలనీల్లో చేపట్టం జరుగుతుంది.

– సాబేర్ అలీ, మున్సిపల్ కమిషనర్.

సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేయండి

నిజాంపేట్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, నిజాంపేట్ నగర పాలక సంస్థ కార్యాలయంలో పౌరులు సేవలు/ఫిర్యాదులు చేయాల్సిన ఎస్ఎంసీ అధికారుల సమాచారాన్ని ఓ ప్రకటన ద్వారా విడుదల చేశారు.

అధికారి పేరు	హోదా / ప్రాంతం	మొబైల్ నెంబర్
వి. వసంత	డీఈ	8977752140
మహ్మద్ యూనస్	డీఈ	9063497713
పి.ప్రవీణ్ కుమార్	ఏఈ	9063497715
రోడ్డు, డ్రైనేజీ, ఇతర మరమ్మతుల ఫిర్యాదుల కోసం..		
బి.నితిన్ కుమార్	నిజాంపేట్	8106821999
వి.సంధ్యారాణి	ప్రగతినగర్	8125394999
డి.ప్రియదర్శిని	బాచుపల్లి	8712408435
వీధి దీపాలు సంబంధిత..		
వి.సుష్మ	ప్రగతినగర్	8712408447
ఎస్.శ్రీకాంత్	నిజాంపేట్	8019726999
ఎస్.అఖిల్ ప్రసాద్	బాచుపల్లి	8712408429
పారిశుద్ధ్య విభాగం..		
బి.జయరాజు	ఉన్నత అధికారి	8977752141
వివిధ రకాలైన పట్టణ పారిశుద్ధ్య అంశాలపై ..		
సుకృతరెడ్డి	ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ (ఓఎస్)	8712408431
ఎండీ అహ్మద్ అలీ	బాచుపల్లి (వార్డ్ 15–21)	8712408437
టి.నాగేందర్‌రెడ్డి	ప్రగతినగర్ (వార్డు 2–6, 22–25)	8712408442
కె.సుదర్శన్‌రెడ్డి	నిజాంపేట్ (వార్డు 7–14)	8019851999
కె.సతీష్ కుమార్	నిజాంపేట్ (వార్డు 26–33)	8712408430
టౌన్ ప్లానింగ్ విభాగం		
హెచ్ జ్యోత్స్నదేవి	ఏసీపీ	7416791042
రోడ్డు ఆక్రమణ, అక్రమ కట్టడాలపై ..		
కె.ప్రతాప్ సింగ్	సీనియర్ అసిస్టెంట్	9618588397
టి.వెంకట్‌రావు	ప్రగతినగర్	8712408439
శ్రీకాంత్‌గౌడ్	నిజాంపేట్	8712408438
వి.శ్రీకాంత్ నాయక్	బాచుపల్లి	8712408440
రెవెన్యూ విభాగం..		
సి.హెచ్.రమేష్	ఆర్ఓ	8977752137
ఆస్తి పన్ను సంబంధిత అంశాలపై ..		
సి.మధుసూధన్‌రావు	ఆర్ఐ (నిజాంపేట్)	9063497712
ఎస్.జంగయ్య	ఆర్.ఐ (బాచుపల్లి)	9848968037
బి.సుభాష్	ఆర్.ఐ. (ప్రగతినగర్)	9063497714
వన మహోత్సవం అంశాలపై ..		
యల్.గంగాధర్	ఎస్ఎంసి	8712408436

క్రీడా స్ఫూర్తితో పోటీపడాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్/జీడిమెట్ల: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో పోటీపడాలని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్‌నగర్‌లోని బ్యాడ్మింటన్ ఇండోర్ షటిల్ కోర్టులో ఎస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే టోర్నమెంట్‌ను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలతా సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా పిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, ఎస్.ఆర్.నాయక్‌నగర్ కాలనీ అధ్యక్షుడు టీటీకే శ్రీనివాస్, అపురూప కాలనీ జనరల్ సెక్రటరీ రమణ, ఎస్.ఆర్ నగర్ కాలనీ ఉపాధ్యక్షులు మల్లికార్జున్, సూరిబాబు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం ఆదివారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఐడీపీఎల్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు బాలానగర్ ఫీడర్, ఐడీపీఎల్ ఫీడర్ పరిధిలోని సాక్షి ప్రింటింగ్ ప్రెస్, ఎస్‌వీసీఐఈ ఫీడర్ పరిధిలోని ఫతేనగర్, వాల్మీకి నగర్, భగత్ సింగ్ పార్క్, శివశంకర్ కాలనీ, లాల్ బహుదూర్ శాస్త్రి నగర్, పిట్టల బస్తి, ఫిష్ మార్కెట్, ప్రాగాటూల్స్ సబ్ స్టేషన్ ఎల్ అండ్ టీ ఫీడర్ పరిధిలో గాంధీనగర్, సీఐ గాంధీనగర్ ఇండస్ట్రియల్ ఏరియా మధ్యాహ్నం 2: 30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ప్రాగాటూల్స్ సబ్‌స్టేషన్ ఈశ్వర్ విమల్ ఫీడర్ పరిధిలోని గిరి నగర్, సీఐఈ గాంధీనగర్, రీగల్ రెక్షనాల్డ్ గల్లీ, శివ పార్కింగ్, ఐడీపీఎల్‌ఎల్ సబ్ స్టేషన్ టిబ్యాన్ ఫీడర్ పరిధిలో టిప్కాన్ ఇండస్ట్రీ ఏరియా, ఏకో ప్యానల్స్, క్యూ పి ఎస్ ల్యాబ్స్, ఆంధ్ర ఇండస్ట్రీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కల్యాణం.. కమనీయం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని శ్రీ హరి హర క్షేత్రంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయ శిఖర సంప్రోక్షణ, సీతారాముల కల్యాణం వంటి పూజా కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అనంతరం అహోబిల జీయర్ స్వామి కరకమలములచే కుంభ ప్రోక్షణ, 11 గంటలకు సీతారాముల కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం, అనంతరం అన్న సమారాధన, సాయంత్రం భరత్ నగర్ కాలనీలో హనుమంత్ సేవ రాముల వారి ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, నాయకులు ప్రసాద్ రెడ్డి, దేవిరెడ్డి మనోహర్ రెడ్డి, విజయ కుమార్, సంతోష్, రవీందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఉత్సవ కమిటీ ఎన్నిక



నూతన ఉత్సవ కమిటీ సభ్యులు

నిజాంపేట్: జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆస్కానీ మారుతి సాగర్ అధ్యక్షతన నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో చెర్ల ఎల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద శనివారం బోనాల ఉత్సవ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ధర్మకర్తగా కొలను శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య సలహాదారులుగా కొలను సునీల్ రెడ్డి, ముక్క దేవేందర్ గుప్తా, నాగేంద్ర చారి, మేకల జీతయ్య, ఉత్సవ కమిటీ ఆలయ చైర్మన్‌గా మారుతి సాగర్, అధ్యక్షులుగా ముక్కర్ల లాలయ్య, ఉపాధ్యక్షులుగా కె.రాము యాదవ్, పి.మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శులుగా కె.వెంకట్, ఓ.లింగస్వామి, సహాయ కార్యదర్శులుగా టి.కృష్ణారావు, పితాని శ్రీనివాస్, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా ఎం.మారుతి కుమార్, కె.వి.వి సత్యనారాయణ, ఏ.గోవిందరావు, కె.రమేష్, దాలి నాయుడు, కోశాధికారులుగా టేకుల సుధాకర్‌రెడ్డి, దామెర జగదీశ్వర్‌గుప్తా, కార్యవర్గ సభ్యులుగా జి.శ్రీనివాస్, కె.వెంకటేష్, ఎం.మహేష్, లక్ష్మణ్, జి.వెంక్రటావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బహిరంగ సభకు కదలాలి

మోతీనగర్: విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్స్ కన్వర్షన్‌కై విద్యుత్ సిబ్బంది కుటుంబ సభ్యులతో ఈ నెల 18న ఉదయం 11 గంటలకు మింట్ కాంపౌండ్‌లో జరిగే బహిరంగ సభకు కదలాలని గ్రీన్ ల్యాండ్ ఎలక్ట్రిసిటీ విద్యుత్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ఎం పాష కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బహిరంగ సభకు ముఖ్య వక్తగా ప్రొఫెసర్ జి. హరగోపాల్ పాల్గొననున్నట్లు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



బ్లడ్ డోనర్స్ డే వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

నిజాంపేట్: ఎల్.బి.నగర్ సంఘం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్లడ్ డోనర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్‌కు చెందిన సంఘం బ్లడ్ బ్యాంక్ చైర్మన్, ఆర్‌కెపి ప్రెసిడెంట్ డాక్టర్ అద్దంకి రంజిత్ ఓపీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. ఈ బ్లడ్ బ్యాంక్‌ని అత్యున్నత ప్రమాణాలతో నడుపుతూ అనతికాలంలోనే ఉన్నత స్థానానికి తీసుకువచ్చిన సంఘం బ్లడ్ బ్యాంక్ ఫౌండర్, ప్రెసిడెంట్ గిరి యాదవ్‌ను అభినందించారు. అనంతరం సంఘం బ్లడ్ బ్యాంక్ ఫౌండర్ గిరి యాదవ్ మాట్లాడుతూ ఎల్.బి.నగర్ సంఘం బ్లడ్ బ్యాంక్ 6వ వార్షికోత్సవంతో పాటు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టడం చేపట్టినట్లు తెలిపారు.

బీజేపీ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని, ఆ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం దుండిగల్ మున్సిపల్ బీజేపీ ఆధ్వర్యంలో గండిమైసమ్మ చౌరస్తాలోని శ్రీసాయిబాలాజీ ఫంక్షన్ హాల్‌లో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రాజేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ దుష్టపాలన కొనసాగుతుందని విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ నాయకులు ప్రతి బస్తీ, కాలనీకి వెళ్లి స్థానిక సమస్యలను పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్, ఇన్‌చార్జి వెంకటేష్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, నూతన కమిటీ సభ్యులు ఆంజనేయులు, రోజా, మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు తురాయి భానుగౌడ్, దమ్మగారి సీతారాం రెడ్డి, కార్యదర్శులు ఎస్ లత, తలారి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కమిటీ జాబితాను ఎంపీకి అందజేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: బీజేపీ కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు కట్టాకుమార్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, శ్రీధర్ వర్మ, డివిజన్ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలకు గవర్నర్ అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి

సుభాష్‌నగర్: దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రతిష్టాత్మకమైన గవర్నర్ అవార్డును దక్కించుకుంది. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాల సామాజిక కార్యక్రమాలు, యూజీసీ అటానమస్, నాక్–ఏ ప్లస్ సర్టిఫికేషన్‌లు పొందిందని, వివిధ కంపెనీలతో ఎంఓయూలు, విద్యార్థులకు వంద శాతం ప్లేస్‌మెంట్లను కల్పిస్తోందన్నారు. ఐదవసారి గవర్నర్ అవార్డు పొందడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, డైరెక్టర్ సంతోష్‌కుమార్ పాత్రా తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసం.. వాయిదాల పర్వం !

ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు

- నిధులు లేక అమలులో ఆపసోపాలు
- శివారుల్లో దరఖాస్తులు 66,648
- మంజూరైన యూనిట్లు 24,610 మాత్రమే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో దరఖాస్తులు ఇలా..

ప్రభుత్వ శాఖలు	దరఖాస్తులు	యూనిట్లు
ఎస్సీ కార్పొరేషన్	16,300	6,201
ఎస్టీ కార్పొరేషన్	2,196	1,594
బీసీ సంక్షేమ శాఖ	37,935	13,400
ముస్లిం–క్రిస్టియన్ మైనార్టీ	10,217	3,415

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలులో వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ పథకానికి సంబంధించి రుణ లక్ష్యం తక్కువగా ఉండటం, దరఖాస్తులు ఎక్కువగా రావడంతో ఇప్పట్లో ఈ పథకం పట్టాలపైకి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని నిరుద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రాయితీపై రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు అందించాలనే ఉద్దేశంతో యువత నుంచి నెల రోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖలు వేర్వేరుగా దరఖాస్తులు స్వీకరించాయి. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాలు, 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ పరిధిలోని 8 మున్సిపల్ సర్కిళ్లకు సంబంధించి 24,648 యూనిట్లు మంజూరు కాగా.. దరఖాస్తులు మాత్రం 66,648 వచ్చాయి. ఈ నేపథ్యంలో రూ.50 వేల యూనిట్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికార యంత్రాంగం గుర్తించిన అర్హులకు ఈనెల 2 నుంచి రుణపత్రాలు పంపిణీ చేయాలని నిర్ణయించినా.. చివరి నిమిషంలో వాయిదా పడింది.

ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదంతోనే..

రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా అధికారులే చేస్తారని నిబంధనల్లో రూపొందించారు. తీరా తుది జాబితా ఎంపికలో అధికార పార్టీ నాయకులు సూచించిన వారికే ప్రాధాన్యత లభించిందని ఆరోపణలున్నాయి. ఇది వరకే రుణం తీసుకున్న లబ్ధిదారుల సిబిల్‌స్కోర్‌ను రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు ఆధారంగా తీసుకుంటున్నారు. సిబిల్ స్కోర్ అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించినా.. ప్రయోజనం లేకపోయింది.

బయటికి రాని అర్హుల జాబితా..

విభాగాల వారీగా పురపాలక సంఘాలు, మండల కమిటీలు రాజీవ్ వికాసం పథకం కింద లబ్ధిదారులను గుర్తించిన అధికారులు మాత్రం అర్హుల జాబితాను బయట పెట్టడం లేదు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదం లేకుండా జాబితా బయటపడకుండా శాఖాపరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. రుణ పత్రాల పంపిణీ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీ కార్పొరేషన్ వర్గాలు పేర్కొంటున్నాయి.